హైదరాబాద్ వార్త



## పోలీసు రిక్రూట్‌మెంట్
# పాత పద్ధతిలో జరగాలి

### నిరుద్యోగులు

గోషామహల్, డిసెంబర్ 14 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం పోలీసు విభాగంలో కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే పోలీసు రిక్రూట్‌మెంట్ పాతపద్ధతిలో చేపడితే సుమారు 4లక్ష18వేల740మంది తెలంగాణ నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని పోలీసు ధరఖాస్తుదారులు తెలిపారు. అయితే పోలీసు రిక్రూట్‌మెంట్ ఏప్రిల్25 వ తేదిన పోలీసు ఉద్యోగానికి నోటిఫికేషన్ జారీ చేశారు. కాని అందులో కొంత అన్యాయం జరిగిందని ధరఖాస్తుదారులు వాపోయారు. రాజ్యాంగం ప్రకారం ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనార్టీలకు సరైన రిజర్వేషన్లు అమలు చేయకుండా,అందరికి గంపగుత్తాగా 30శాతం ఎగ్జామ్ క్వాలిఫైకండిషన్ పెట్టినట్లు వాపోయారు. అక్టోబర్2వ తేదిన సప్లమెంటరీ మోమె ద్వారా రిజర్వేషన్‌లు ఓసి30, బిసిలకు 25,ఎస్‌సి, ఎస్‌టి, ఎక్స్‌సర్వీస్‌మాన్‌కి 20శాతం అమలు చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు రిక్రూట్‌మెంట్‌బోర్డు అసలు మెలికాపెట్టారు. దేహదారుడ్య పరీక్ష ఈనెల8వ తేది నుంచి ప్రారంభించారు. తెలంగాణ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ముందు ఎన్నాడులేని విధంగా 800మీటర్ల బదులుగా 1600మీటర్లు పెంచారు. కాని సమయం 7నిమిషాల15 సెకండ్‌లు పెంచారు. 3.80మీటర్లు ఉన్నలాంగ్ జంపును 4మీటర్లుకు పెంచారు. షాట్‌పుట్‌ను 6మీటర్లు పెంచారు. దీంతో కానిస్టేబుళ్లు, ఎస్ఐ ఉద్యోగాలకు ధరఖాస్తు చేసు కున్న అభ్యర్డులు అధికంగా 1600మీటర్లలో క్వాలీఫైయి అవుతున్నప్పటికి, అధికంగా లాంగ్‌జంపులో సఫలం కాలేకపోతుమన్నారు. దీనికితోడు ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలో 1600మీటర్లకు 8నిమిషాలుపెంచగా, లాంగ్‌జంపును 3.80మీటర్ల పాతపద్ధతిలో కొనసాగిస్తున్నారు. తెలంగాణ పోలీసు విభాగం కన్న 1600 మీటర్‌లో 7నిమిషాల15 సెకండ్‌లు నిర్ణయించగా, ఆంధ్రపోలీసు విభాగం 45సెంకడ్ అదనపు సమయాన్ని పెంచారు. తెలంగాణ పోలీసు విభాగం కొత్త కానిస్టేబుళ్లు, ఎస్ఐపోస్టులకు పాతపద్ధతిలోనే పోలీసు రిక్రూట్‌మెంట్ చేయాలని తెలంగాణ నిరుద్యోగులు నరేష్‌కుమార్, రాకేష్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. కాగా నిరుద్యోగ యువతి, యువకుల జీవితాలను తెలంగాణ పోలీసు రిక్రూట్ మెంట్‌బోర్డు ఆగం చేస్తున్నట్లు వాపోతున్నారు. 800మీటర్లు ఉన్న పరుగు ఏకంగా 1600మీటర్లు పెంచడంపట్ల తీవ్ర ఆవేధన వ్యక్తం చేశారు. గతంలో 800మీటర్లు, లాంగ్‌జంపు, షాట్‌పుట్, 100మీటర్లు, హైజంపులో మూడు క్వాలీఫైడ్ అయితే పరీక్షలకు అనుమతి ఇచ్చేవారు. పరీక్షలోపాసైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించిన ఎంపిక చేసేవారు. ప్రస్తుతం తెలంగాణ ఏర్పడిన తరువాత పోలీసు విభాగంలో కొత్త పద్దతిలో రెండుసార్లు పరీక్షలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అడుగుదూరంలోనే పోలీసు కొలువులను కోల్పోతున్నట్లు తెలిపారు.

# డబ్బులివ్వనిదే దస్త్రం కదలదు

**కేసులు అంతంతమాత్రమే..**

అవినీతి నిరోధక శాఖ (ఏసీబి) రెండు రకాల కేసులు నమోదు చేస్తుంది. అధికారులు ఎవరైనా పనులు చేయటానికి లంచాలు అడుగుతున్నట్లు బాధితులు ఫిర్యాదు చేస్తే డబ్బులు అందించేటప్పుడు వలపన్ని అధికారులను పట్టుకుంటారు. రెండోది ఆదాయానికి మించి ఆస్తులున్న వ్యాపారులు, అధికారులను సైతం, ఇళ్లు, వారి వ్యాపార కేంద్రాలపై దాడులు చేసి పట్టు కుంటారు. అయితే బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు అక్కడక్కడ లంచావతారులను పట్టుకుంటున్న అధికారులు ఆదాయానికి మించి ఆస్తులున్నవారిపై దృష్టి సారించడం లేదు. ఇలాంటి వారిపై రహస్యంగా విచారణ జరిపి పట్టుకోవాల్సి ఉండగా ఇలాంటి కేసుల విషయంలో ఆసక్తి కనబరచడం లేదు. ప్రలు ప్రభుత్వ శాఖల్లో లంచాలు పెరుగుతున్నా కేసులు మాత్రం పెరగటం లేదు. ఏసీబికి దొరికిన అధికారులు ఏదో ఒక రాజకీయ నాయకుడి అండతో కొంతకాలంపాటు దూర ప్రాంతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మళ్ళీ పాతపాటే పాడుతున్నారు. కారణం అవినీతి నిరోధక శాఖ గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడమేనని తెలుస్తుంది. ప్రతి ఏడాది కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఈ విషయంలో ఉన్నతాధి కారులు ప్రజల్లో అవగాహన కల్పించాల్సి అవసరం ఉంది.



**పనికావాలంటే.. చేయి తడపాల్సిందే**

**ప్రభుత్వ కార్యాయాల్లో సిబ్బంది తీరు**

**ఎసిబి దాడుల్లో వెలుగులోకి అవినీతి జలగలు**

హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త: లబ్దిదారులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం, ఇతర ప్రయోజనాలు ఏవైనా ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు ఇవ్వందే దస్త్రం కదలని పరిస్థితి నెలకొంది. చేయి తడిపితేకానీ అధికారులు పనులు చేయడం లేదనే విమర్శలు బహిరంగానే వినిపిస్తున్నాయి. ఆస్తి బదలాయింపు, నల్లాకనెక్షన్, పవర్ కనెక్షన్, చివరికి పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మీ, షాధీముబారక్ పథకాలు వర్తించాలన్నా విచారణధికారులు చేతులు తపడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. తాజాగా మంగళవారం ఖైరతాబాద్ జిహెచ్‌ఎంసి సర్కిల్ జనన,మరణ దృవపత్రాల విభాగంలోని హెల్త్ అసిస్టెంట్ (ఏవో) ఎసిబివలకు చిక్కాడు. అత్తాపూర్‌లోని సాయి చైతన్య రెసిడెన్సీలో నివాసం ఉంటున్న దోసి సురేష్ ఖైరతబాద్ సర్కిల్‌లో పనిచేస్తున్నాడు. అమీర్‌పేట్‌కు చెందిన ఓదెల హరికాంత్ తనబం ధువు రామగిరి మధుకుమార్ మరణ దృవపత్రంలో ఇంటిపేరు చేర్పించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు.దీంతో ఏవో 6వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధి తుడు 4.500లకు అంగీకరించి విషయాన్ని ఎసిబికి అధికారులకు తెలియ జేయగా.. ఏవో డబ్బుతీసుకుంటుంటే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే వారం రోజుల క్రితం పాతబస్తీ యాకత్‌పురాలో ఏఈ రాజశేఖర్, గ్రేడ్2 మీటర్ రీడర్, బిల్‌కలెక్టర్ మెమ్మద్‌జమాల్ 20వేలు లంచం తీసుకుంటుండగా ఎపిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. యాకత్‌పురాకు చెందిన ఉస్మాన్ షరీఫ్ పాత ఇంటిని కూల్చి వేసి పునర్మిర్మాణం చేస్తుండగా పాత ఇంటి మీద బకాయి ఉండటంతో కొత్త మీటర్ ఇవ్వడానికి విద్యుత్ అధికారులు సమేమిరా అన్నారు. దీంతో పాత విద్యుత్ మీటర్ బిల్లుకు రూ. 50వేలు ఇస్తే మాఫీ చేస్తామని డిమాండ్ చేశారు. 40వేలకు ఒప్పందం కుదుర్చుకుని మొదటి 20వేలు అప్పుజెప్పగా మళ్ళీ 20వేల కొరకు వేధిస్తుండటంతో సరీఫ్ ఏసిబిని ఆశ్రయించాడు. దీంతో ఈ సందర్భంగా షరీఫ్‌నుంచి డబ్బులు తీసుకుంటుండగా అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్, బిల్‌కలెక్టర్ జమాల్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇలా నిత్యం వివిధ ప్రభుత్వశాఖల్లో అవినీతి జలగలు బయపటడుతూనే ఉన్నాయి. జిహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్ట్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ ఇలా అనేక శాఖల్లో అవినీతి తాండవి స్తోంది. తమపనులు చేసిపెట్టాలని వెళ్లిన లబ్దిదారులు డబ్బులు ఇవ్వకుంటే సదరు దస్త్రంలో లేనిపోని కారణాలు చూపిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పెండింగ్‌లో పెట్టడం సర్వసాధారణంగా మారిం ది. పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయిన లబ్దిదారులు రాజీపడి విధిలేని పరిస్థితుల్లో ఎంతో కొంత ముట్టచెప్పి వారిపనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేయి తడిపితే మాత్రం అవసరమై ధ్రువపత్రాలు ఉన్నా లేకున్నా పనులు చకచకా చేసిపెడుతున్నారు. లంచావతారుల బెడద తప్పించడానికి ప్రభుత్వం పలురకాల ప్రయోజనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనలు ప్రవేశపెట్టింది. అయితే ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునప్పటికీ సంబంధిత విచారణాధికారిని కలువకపోతే ఆశించిన ప్రయోజనం అందుబాటులోకి రాకుండా పోతుంది. సదరు అధికారిని కలిసి ఎంతో కొంత ముట్టచెబితేనే సకాలంలో పనులయ్యేలా చూస్తున్నారు. వేలకు వేల రూపాయలు వేతనాలు రూపంలో పొందుతున్న అధికారుల దిగజారుడుతనం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

## మలక్‌పేట నల్గొండ చౌరస్తావద్ద ఢీకొన్న లారీలు

**భారీగా స్థంభించిపోయిన ట్రాఫిక్ - క్రేన్ సహాయంతో లారీలను తొలగింపు**





మలక్‌పేట నల్గొండ చౌరస్తావద్ద లారీలు ఢీకొన్న దృశ్యం, భారీగా స్థంభించిపోయిన ట్రాఫిక్

మలక్‌పేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త : తెల్లవారంజామున మలక్‌పేట నల్గొండ చౌరస్తావద్ద లారీలు ఢీకొన్న సంఘటనతో సుమారు మూడు గంటలపాటు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్ప డింది. ఈ సంఘ టన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసు కుంది. పోలీసుల కథనం ప్రకారం మలక్‌పేట నల్గొండ చౌరస్తావద్ద రాజస్థాన్‌కు చెందిన లారీ మధ్యప్రదేశ్‌నుండి గోధుమ రవ్వను తీసుకువెళుతూ యూ టర్న్ తీసుకుం టుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన మరో లారీ వెనుకనుండి వచ్చి ఢీకొట్టడంతో రాజస్థాన్‌కు చెందిన లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తాపడగా మరో లారీ రోడ్డు డివైడర్ పైకి ఎక్కి ఆగింది. ఈ సంఘటనతో చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్‌సుక్‌నగర్‌కు వెళ్లే రహదారులపై తీవ్ర ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. ఈ సంఘటనలో లారీని ఢీకొట్టిన మరో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయా లకు గురైన లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న, చాదర్‌ఘాట్ పోలీసులు శ్రమించి రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలను రెండు క్రేన్ల సహాయంతో తొలగించడంతో ట్రాఫిక్ సజావుగా కొనసాగింది. ఈ మేరకు ఎస్ఐ శ్రీశైలం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునన్నారు.

## మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్ప స్వామి మహాపడిపూజలో స్వామి పూజలు చేస్తున్న స్వాములు

నాచారం, డిసెంబర్ 14 ప్రభాతవార్త: నాచారం రాఘవేంద్రనగర్ కాలనీ లో మల్లేష్ గురుస్వామి ఆద్వర్యంలో సిఎస్ బ్రదర్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమం కన్నుల పండువగా నిర్వ హించారు. కేరళ తంత్రి వర్యులు బ్రహ్మశ్రీ కె. సంబు నుంబూద్రి తంత్రి పర్యవేక్షణలో కేరళ సాంప్రదాయ పద్ధతిలో పడిపూజ ఘనంగా నిర్వహించారు. 108 కలశాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి మల్లేష్ గురుస్వామి చందనం, విబూతి, పంచామృ తాలు, నెయ్యితో అభిషేకం నిర్వహించారు. శ్రీ భవాని మహాశాస్త్ర భజన సమాజ్ లక్ష్మణ గురుస్వామి భజన మండలి వారు అయ్యప్ప గీతాలను పాడారు. అయ్యప్ప స్వాములు లయబద్దంగా చేతులు కలుపుతూ భజనలు చేశారు. దీంతో ఈ ప్రాంతమం తా అయ్యప్ప శరణు ఘోషతో భజనలతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో శివ, నరసింహన్, వందలాదిగా అయ్యప్ప స్వాములు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవత్వానికి అర్థం చెప్పిన సందేశాత్మక
# బహుభాషా నాటకం 'ఒక అనుఖి రూప్ కథ'



'ఒక అనుఖి రూప్ కథ' బహుభాషా నాటకంలో దృశ్యం

రవీంద్రభారతి, డిసెంబరు 14 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, తమిళనాడు తంజావూరు సౌత్ జోన్ కల్చరల్ సెంటర్, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, హైదరాబాద్ అభినయ థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 12 నుండి నేటివరకు మూడు రోజులపాటు జరుగుతున్న ప్రతిష్టాత్మక అభినయ 16వ జాతీయ బహుభాషా నాటకోత్సవాలు 'అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్-2022' బుధవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో విజయవంతంగా ముగిసాయి. ఈ బహుభాషా జాతీయ నాటకోత్సవాల్లో మూడవ ఆఖరిరోజు రాత్రి 6.30లకు శూద్రుక, సికిందరాబాద్ వారి నిర్వహణలో బెట్రోల్డ్ బ్రెచ్ట్ 14వ శతాబ్దంలో రచించిన చైనీస్ నాటకం అనువాదం, స్వపన్ మండల్ దర్శకత్వంలో మానవతకు, మానవీయ విలువలను కలిగి ఉండడానికి ధనవంతులు, అధునాతన, గొప్ప సామర్ధ్యాలు తప్పనిసరి కలిగివుండాల్సిన అవసరం లేదని, ప్రేమ మమతానురాగాలు, సత్సంబంధాలు అతిముఖ్యమని తెలియజెప్పుతూ మానవత్వం ఎక్కడ విరాజిల్లుతుందో అక్కడ కృషికి తగిన గౌరవం, విలువలు లభిస్తాయన్న సందేశాన్నందిస్తూ రూపొందిన బహుభాషా నాటకం 'ఒక అనుఖ రూప్ కథ' (చాక్ సర్కిల్) అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడి హాజరైన విశేష ప్రేక్షకులను రంజింపజేసి ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా డి.సురేష్‌కుమార్ సభాధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ముఖ్యఅతిథిగా ఎం.నాగేశ్వరరావు, విశిష్ట అతిథులుగా డా. మామిడి హరికృష్ణ, బొప్పన నరసింహారావు (బుజ్జి), కె.సుబ్బారావు, అభినయ శ్రీనివాస్ తదితరులు పాల్గొని నాటక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను ఎంతగానో అభినందించి ఘనంగా సత్కరించారు.

# ఒయు విద్యార్థులు సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షల్లో రాణించాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్**



ఒయూలో సివిల్ సర్వీసెస్ అకాడమిని ప్రారంభిస్తున్న చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్, సీనియర్ ఐఎఎస్ అధికారి, బిసి సంక్షేమ శాఖ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, వైస్ చాన్సలర్ ప్రొ. రవీందర్ యాదవ్

తార్నాక, డిసెంబర్ 14 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షల్లో రాణించి ఐఎఎస్, ఐపీఎస్‌లుగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన సివిల్ సర్వీసెస్ అకాడమిని ఆయన ముఖ్య అతిథిగాహాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎస్ సోమేష్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులకు పోటీపరీక్షల తర్ఫీదు ఇచ్చే విదంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కళలను నిజం చేసేలా చొరవతీసుకోవాలని సూచించారు. ఒయూలో అకాడమి ఏర్పాటుకు చర్యలు తీసుకున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.డి.రవీందర్ యాదవ్‌ను ఆయన అభినందించారు. విద్యార్థులు కష్టపడి ఉద్యోగాలు సంపాదించాలని సూచించారు. రాష్ట్ర పతి ఉత్వర్వ్యూల వల్ల తెలంగాణలో తప్ప మరే రాష్ట్రంలోను స్థానిక విద్యార్థులకు 95 శాతం రిజర్వేషన్లు లేవన్నారు. 24 గంటలు విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్దమయ్యేలా యూనివర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు లైబ్రరీ, సెక్యూరిటీ, వైఫై ఇతర వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓ.యూలో తనతో పాటు కీలక పదవిలో పనిచేస్తున్న ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఓ.యూలో విద్యార్థులుగా చేరండి సివిల్ సర్వెంటుగా వెళ్లండి అనే నినాదంతో సివిల్ సర్వీసెస్ అకాడమిని ఏర్పాటు చేశామని వైస్ చాన్స్‌లర్ ప్రొ.డి.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. 21 పాయింట్ల ఎజెండాతో ఓయూ విద్యార్థులను మెరుగైన విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాము చేపట్టిన సంస్కరణలతో జాతీయ స్థాయిలో ఒయూకు 22వ స్థానం వచ్చిందన్నారు. వృధా అయిన సమయం తిరిగి రాదని విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ పేర్కొన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి మాట్లాడుతూ కష్టపడి అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు గొప్పగా ఆలోచించాలని, కళలను సాకారం చేసుకునేందుకు కష్టపడి చదువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ పి.లక్ష్మినారాయణ, ఓయూ సివిల్ సర్వీసెస్ అకాడమి డైరెక్టర్ ప్రొ.సి.గణేష్, ప్రొ. గడ్డం మల్లేశం, ప్రొ.మంగుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం



సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త : సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఇన్స్‌పెక్టర్ ముత్తూ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం సుమారు 10గంటల ప్రాంతంలో సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మెయిన్ రోడ్డు ప్రక్కన ఉన్న ఇండస్ట్రీయల్ పార్కు ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తి చనిపోయినట్లు తెలిపారు. అతని గురించి ఎలాంటి వివరాలు తెలియవని, కావున చనిపోయిన వ్యక్తి వివరాలు ఏమైనా ఎవరికైనా తెలిస్తే ఈ క్రింద తెలిపిన ఫోన్ నెంబర్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. సిఐ ముత్తూ యాదవ్ - 9490617132, ఎస్ఐ మురళి గౌడ్ - 9866683448

## నేడు తెలుగు యూనివర్సిటీలో
# బాపు రమణ పురస్కారోత్సవం

హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త: బాపు రమణ పురస్కారోత్సవం -2022ను గురువారం నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో సాయంత్రం 5గంటలకు నిర్వహించనున్నట్లు గౌరవాధ్యక్షులు కళారత్న బ్నిం కార్యదర్శి కలామిత్ర వేగిరాజు సుబ్బరాజుల ఒప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ బాపు జన్మదినం సందర్భంగా నిర్వహించే ఈకార్యక్రమంలో ప్రముఖ కార్టూనిస్టు, క్యారికేచరిస్టు పామర్తి శంకర్‌కు బాపు పురస్కారం, ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మికి రమణ పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి, సంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సినీనటుడు తనికెళ్ల భరణి, విజయచందర్, గాయని సునీత, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ గురువారెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు.

## 7 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం
# చేసుకున్న నాచారం పోలీసులు

నాచారం, డిసెంబర్ 14 ప్రభాతవార్త: అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. కవాడిగుడకు చెందిన మహ్మద్ ఖాజా, మహ్మద్ అశ్రఫ్ నాచారం మాణిక్ చంద్ చౌరస్తా వద్ద ఓ గోడౌను అద్దెకు తీసుకున్నారు. అందులో చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం (పిడిఎస్)ను రూ.6 కు కొనుగోలు చేసి అదే బియ్యాన్ని ప్లాస్టిక్ సంచుల్లో ప్యాకింగ్ చేసి కిలోకు రూ.12 చొప్పున భీదర్ జిల్లా కార్ణాటక రాష్ట్రానికి తరలించి అక్కడ విక్రయించి అక్రమంగా డబ్బును సంపాదిస్తున్నారు. ఇదిలా ఉండగా బుధవారం బీహార్ రాష్ట్రానికి చెందిన రామ్‌పుకార్ కుమార్ గౌడాన్ వద్ద ఉండగా అనుమానం వచ్చిన పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని సమాచారంతో ఈ గోడౌన్‌లో తనిఖీ చేయగా అందులో 7 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. నిందితులైన ఖాజా, అశ్రఫ్‌లు పరారీలో ఉన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రపతి విడిదికి జిల్లా పరిధిలోని హాకీంపేట్ ఎయిర్‌పోర్టులో ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 14, ప్రభాతవార్త : ఈ నెల 26న శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ విచ్చేస్తున్నందున మేడ్చల్ జిల్లా పరిధిలోని హాకీంపేట్ ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతి రాక సందర్భంగ ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి రాక సందర్భంగ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగ ఉండాలని సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్రపతి రాక సందర్భంగ జిల్లా అధికారులతో ముందస్తు సమీక్షా సమావేశంను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని అధికార యంత్రంగం అంత అప్రమత్తంగ ఉండి వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగ నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 26వ తేదీన మేడ్చల్ జిల్లా పరిధిలోని హాకీంపేట్ ఎయిర్‌పోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రత్యేక విమానంలో విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఆ తరువాత హాకీంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి ద్రౌపదిముర్మ రాష్ట్రపతి నిలయంకు విచ్చేస్తున్నట్లు వివరించారు.హాకీంపేట్ ఎయిర్‌పోర్టులో అవసరమైన ఏర్పాట్లు అన్ని కూడ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రాష్ట్రపతి రాక సందర్భంగ మెడికల్ కిట్స్, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డిఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాస్‌కు కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు ఇరవై నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండే విధంగ సంబంధిత అధికారులు చూడాలని, జనరేటర్‌ను కూడ అందుబాటులో పెట్టుకోవాలని ఆయన సూచించారు. హాకీంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి బొల్లారం వెళ్లె రూట్‌లో ఎలాంటి గుంతలు,గతుకులు లేకుండ గుంతలను పూడ్చివేయాలని, లేదా కొత్తగ రోడ్డు వేయటం చూడాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అటవీ శాఖ అధికారులు హాకీంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి రాష్ట్రపతి బొల్లారం వెళ్లె మార్గంలో పూలమొక్కలను ఏర్పాటు చేయటంతో పాటు రహదారికి ఇరువైపుల ఆకర్షణీయంగ కనిపించేలా రకరకాల పూలమొక్కలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్రపతి రాక సందర్భంగ అవసరమైన పోలీసు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రపతిని ఆహ్వానించేందుకు వచ్చిన వారిని మాత్రమే ఎయిర్‌పోర్టులోకి పంపాలన్నారు. రాష్ట్రపతి రాక సందర్భంగ భారీ బందోబసు ఏర్పాటుతో పాటు ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండ ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలుగకుండ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, డిఆర్ఓ లింగ్యానాయక్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, ఏసిపి రామలింగరాజు, జిల్లా అటవీ శాఖ అధికారి జానకిరామ్, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓలు రవి, మల్లయ్య, కలెక్టరేట్ ఎఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం క్రతువును నిర్వహిస్తున్న పండితులు

అల్వాల్, డిసెంబరు 14 ప్రభాతవార్త: నాలుగు శతాబ్దాలుగా భక్తులు కోరికలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దేవుని అల్వాల్ శ్రీ గుండం బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలు రెండవ రోజు బుధవారం ధ్వజారోహణం క్రతువును పండితులు నిర్వహించడం జరిగింది. ఈ నెల 13 మంగళవారం ప్రారంభమైన ఉత్సవాలు 17వ తేది శనివారం వరకు సాగుతాయి. ఐదు రోజులు పాటు జరిగే ఉత్సవాలకు నగర నలుమూలలు నుంచి భక్తులు తరలి వస్తారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు పరాంకుశం మాధవాచార్యులు పరాంకుశం కృష్ణమాచార్యులు ప్రధాన అర్చకులు పర్యవేక్షనలో ఉత్సవాలు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలులో ప్రధాన ఘట్టమైన స్వామి వారి కళ్యాణోత్సవం 15వ తేది గురువారం జరగుతుందని మాధవాచార్యులు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవంలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగాల్లో అభివృద్ధి చెందాలి : జంపన ప్రతాప్



కార్ఖాన ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 14 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చేందుకు వారికి కావాల్సిన ప్లే గ్రౌండ్‌లను ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సూచించారు. బుధవారం కార్ఖాన ప్రభుత్వ పాఠశాలలో పర్యటించి విద్యార్థుల ప్లే గ్రౌండ్‌ను చదును చేయించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది రాజేశ్, టీచర్లు సురేందర్ రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్టలో సమస్యలు పరిష్కరించాలి

**బిజెపి డిమాండ్**



అడ్డగుట్ట సమస్యల పరిష్కారంపై డిసీకి వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నేతలు హంసరాజ్, ఉదయ్ తదితరులు

అడ్డగుట్ట, డిసెంబర్ 14 ప్రభాతవార్త: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇటీవల అడ్డగుట్టలో పర్యటించినప్పుడు ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బుధవారం అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి నేతలు జి.హంసరాజ్, గెల్లు ఉదయ్ యాదవ్, మహేశ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దశరత్‌కు వినతిపత్రం అందజేశారు.

### బిజెపి సెంట్రల్ జిల్లా పారిశ్రామికవేత్తల

## సెల్ కన్వీనర్‌గా పల్లె వెంకట్‌గౌడ్

చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త: తెలంగాణలోని పారిశ్రామికవేత్తల హైదరాబాద్ జిల్లా సెల్ కన్వీనర్‌గా, ట్రాన్స్‌పోర్ట్ యజమానుల సంఘం ముఖ్యనేత పల్లె వెంకట్‌గౌడ్‌ను బిజెపి జిల్లా ఇండస్ట్రియల్ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నుంచి నియామకపత్రాన్ని వెంకట్‌గౌడ్ అందుకున్న సందర్భంగా ఆదర్శ సంస్థల అధినేత వంగాల బాల్‌రాజ్‌గౌడ్ అభినందించి సత్కరించారు. ఆదర్శ కిరణం కార్యాలయానికి వచ్చిన సందర్భంగా పల్లె వెంకట్‌గౌడ్‌ను బిజెపి నేతలు గోవర్ధన్‌రెడ్డి, ఆదర్శ సంస్థల మేనేజర్ మంజులగౌడ్ పాల్గొన్నారు. త్వరలోనే పారిశ్రామికవేత్తల సమావేశం, సావనీర్‌ను రూపొందించాలని సూచించడం జరిగిందన్నారు.

## సంగీత దర్శకుడు ఎంఎం కీరణవాణికి మాతృవియోగం

హైదరాబాద్, డిసెంబరు 14,ప్రభాతవార్త: టాలీవుడ్ సీనియర్ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఇంట విషాదం నెలకొంది. కీరవాణి తల్లి భానుమతి బుధవారం ఉదయం కన్నుమూశారు. కొంత కాలంగా వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కీరవాణి ఇంటివద్దే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఆయితే మూడురోజుల క్రితం ఆరోగ్యం క్షీణించడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. కాగా ఆమెభౌతిక కాయాన్ని దర్శకుడు రాజమౌళి ఇంటికి తరలించారు. పెద్దమ్మ అంటే రాజమౌళికి ఇష్టమని ఆమెకూడా ఎంతో వాత్సల్యంతో చూసేవా రని తెలుస్తుంది. కాగా మాతృవియోగం పొందిన కీరవాణికి పవన్‌కళ్యాణ్‌తోపాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు.



పాదయాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న గన్‌ఫౌండ్రీ డివిజన్ బిజెపి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓ ప్రకాశ్ బిస్వాల్, భారతీయ జనతపార్టీ నాయకురాళ్లు

## ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు

**చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధరావత్ నానునాయక్**



ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

ధర్నాచౌక్, డిసెంబర్ 14, ప్రభాతవార్త: ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఎటువంటి వ్యాపార లావాదేవీలు చేపట్టినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధరావత్ నాను నాయక్ హెచ్చరించారు. బుధవారం కవాడిగూడలోని బండమైసమ్మ ఫుట్‌పాత్‌పై అక్రమంగా పెట్టిన దుకాణాలను ట్రాఫిక్ సిబ్బందితో కలసి తొలగించారు. పాదచారులకు అసౌకర్యం కలిగించే విధంగా ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెట్టి వ్యాపారం కొనసాగిస్తున్న వారిపై గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ఫుట్‌పాత్‌లపై వ్యాపారం కొనసాగిస్తూ ఉంటే తక్షణమే వాటిని తొలగించాలని సూచించారు.

## మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులు వెంటనే ప్రారంభించాలి



అరెస్టయిన పాతబస్తీ బిజెపి నాయకులు

చార్మినార్, డిసెంబరు 14 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులు వెంటనే ప్రారంభించాలని భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం లాల్ దర్వాజ చౌరస్తా వద్ద నిరసన దీక్ష నిర్వహించటానికి ప్రయత్నించిన భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు సురేందర్‌రెడ్డి,గోల్కొండ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు చేతన్ సూరి,జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్,భాగ్యనగర్ జిల్లా బిజెవైఎం అధ్యక్షులు శివ చంద్రగిరి, బిజెపి నాయకులు శేఖర్‌తో పాటు పలువురు బిజెపి నాయకులను లాలాగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.సాయంత్రం పోలీసులు బిజెపి నాయకులను విడిచి పెట్టారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు చేతన్ సూరి మాట్లాడుతూ పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులు ప్రారంభం అయ్యే వరకు బిజెపి పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.కాగా రాష్ట్ర బిజెపి మైనార్టీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, గోల్కొండ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు ఎం.కుమార్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.కాగా పాతబస్తీలోని పలువురు బిజెపి నాయకులు అరెస్ట్ చేసి తిరిగి సాయంత్రం విడుదల చేశారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వం

**చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.వెంకటేష్**

చార్మినార్, డిసెంబరు 14 ప్రభాతవార్త : ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.వెంకటేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నిరసన పిలువు నేపధ్యంలో బుధవారం కాంగ్రెస్ నేత వెంకటేష్‌ను శాలిబండ పోలీసులు ముందు జాగ్రత్తగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఆయన మాదాపూర్‌లోని కాంగ్రెస్ పామాజికి మాధ్యమ విభాగం కార్యాలయంపై పోలీసులు సోదాలు చేసి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే సునీల్ కనుగోలు ఆయన అనుచరులను విడుదల చేయాలన్నారు. **తహసీల్దార్‌కు వినతి పత్రం..** మాదాపూర్‌లోని కాంగ్రెస్ పామాజికి మాధ్యమ విభాగం కార్యాలయంపై పోలీసులు సోదాలు చేసి సునీల్ కనుగోలును అరెస్ట్ చేయటాన్ని నిరసిస్తూ టిపిసిసి కార్యదర్శి జి.కన్నయ్యలాల్ ఆధ్వర్యంలో బుధవారం పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముజాహిద్ హుస్సేన్,హుస్సేన్ సయ్యద్,సయ్యద్ ఇక్బాల్, కలీంబాబా,యావర్ అలీ,యూసుఫ్. ధనుష్,మహ్మద్ జబ్బర్‌తో పాటు పలువురు కలిసి బహదూర్‌పుర మండలం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని వారు తహసీల్దార్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విదేశీ విద్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అకాడమీ నిర్వాహకులతో ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్‌కుమార్

పేట్‌బషీరాబాద్, డిసెంబర్14 ప్రభాత వార్త: ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులు విదేశీ విద్యా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్‌కుమార్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ సుచిత్ర కార్యాలయంలో స్టెప్‌ఇన్ లీడ్స్ అకాడమీ ఐదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జి.వినోద్ కుమార్ మాట్లాడుతూ విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 20లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. అదే విధంగా జీఆర్‌ఈ,టోఫెల్,ఐఈఎల్‌టీఎస్,పీటీఈ తదితర అర్హత పరీక్షలకు ఉచిత శిక్షణను కూడా అందిస్తుందన్నారు. స్టెప్‌ఇన్ లీడ్స్ అకాడమీ నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన శిక్షణను సేవా దృక్పథంతో అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్లు వంగూరి బ్రహ్మయ్య, ఉదయ్‌కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పరిరక్షించండి: బిజెపి నాయకులు



అధికారులకు ఫిర్యాదు అందజేస్తున్న బిజెపి నాయకులు

నిజాంపేట్, డిసెంబర్14 ప్రభాత వార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూములలో వెలసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని మండల రెవెన్యూ,మున్సిపల్ అధికారులకు బిజేపి నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా బిజేపి నాయకులు మాట్లాడుతూ బాచుపల్లిలోని సర్వే నెంబర్ 111,112లలో 500గజాల స్థలంలో ఆకృతి కన్‌స్ట్రక్షన్ కంపెనీ జి ప్లస్ 4 అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారు. కానీ నిర్మాణం చేపడుతున్న స్థలం మాత్రం సర్వే110 ప్రభుత్వ భూమిలోకి వస్తుందని, ఈ ప్రభుత్వ స్థలంలో ఆకృతి కన్‌స్ట్రక్షన్ కంపెనీ భవన నిర్మాణానికి అనుమతులు ఏ విధంగా లభించాయని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని తప్పుడు పత్రాలతో తమ భూమిగా సృష్టించి అనుమతులు తీసుకొని భవన నిర్మాణం చేపడుతున్న ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైన ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ బిజెపి అధ్యక్షుడు ఆకుల సతీష్, సెక్రెటరీ ప్రసాద్ చౌదరి, ప్రసాద్‌రాజు, ఈశ్వర్‌రెడ్డి, హెంద్రు తదితరులు పాల్గొన్నారు.

## హౌజ్ అరెస్టైన టిపిసిసి ప్రధాన కార్యదర్శి

చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త: కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేసే కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లేందుకు యత్నించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగేశ్‌ముదిరాజ్‌ను రామ్‌నగర్‌లోని రంగానగర్‌లోని ఆయన నివాసంలో ముషీరాబాద్ పోలీసులు హౌజ్‌అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కొనుగోలు కార్యాలయంపై హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు దాడి చేసి పలు విలువైన డాక్యుమెంట్లను సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఆందోళనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## తెలుగు సాహిత్యానికి కృషి చేస్తున్న తోటకూర ప్రసాద్ అభినందనీయులు

చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త: తెలుగు సాహిత్యానికి విశేషంగా కృషి చేస్తున్న డాక్టర్ ప్రసాద్ తోటకూర అభినందనీయులు అని వక్తలు పేర్కొన్నారు. సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక, సారస్వత సంఘం(ఇట్‌క్లా) అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో తానా ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూరకు అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇట్‌క్లా రజతోత్సవ జ్ఞాపికను వంశీ ఇంటర్నేషనల్ సంస్థ అధినేత, శిరోమని, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, ఇట్‌క్లా అధినేత డాక్టర్ కె.ధర్మారావు సత్కరించారు. ఈ సందర్భంగా తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సాహితీవేత్తలకు గుర్తింపు తీసుకువచ్చేందుకు తనవంతు కృషిచేస్తానని అన్నారు.

### మెన్నోనైట్ బ్రదరన్ బేతేల్ చర్చ్ ఉమెన్స్ ఆధ్వర్యంలో 'ఐక్యక్రిస్మస్' వేడుకలు

చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలోని మెన్నోనైట్ బ్రదరన్ బేతేల్ చర్చ్ ఉమెన్స్ ఆధ్వర్యంలో 'ఐక్యక్రిస్మస్' వేడుకలు ఉమెన్స్ అసోసియేషన్ అండ్ ఉమెన్స్ కమిటీ చైర్‌పర్సన్ కె.రజనీ గిడియోన్, వైస్‌చైర్‌పర్సన్ బబి.హెలెన్‌రిచర్డ్, కార్యదర్శి పి.జయ పురుషోత్తమ్, సంయుక్త కార్యదర్శి డి.మధుమతి సురేందర్, కోశాధికారి ఎలిజెబెత్ మధుకర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించారు.

## నార్సింగి మార్కెట్ యార్డును జిల్లాలోనే నెంబర్ వన్‌గా నిలుపుతాం



నార్సింగి మార్కెట్ కమిటీలో నూతనంగా నియమితులైన డైరెక్టర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్ వెంకటేష్, వైస్ చైర్మన్ మేకల ప్రవీణ్ యాదవ్‌లు

నార్సింగి, డిసెంబర్ 14 ప్రభాతవార్త : నార్సింగి మార్కెట్ యార్డును రంగారెడ్డి జిల్లాలోనే అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలుపుతామని చైర్మన్ వెంకటేష్, వైస్ ఛైర్మన్ మేకల ప్రవీణ్ యాదవ్‌లు పేర్కొన్నారు. బుధవారం నార్సింగి మార్కెట్ యార్డు కార్యాలయంలో నూతనంగా డైరెక్టర్లుగా నియమితులైన నలుగురికి నియామక పత్రాలు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నాయకత్వంలో నార్సింగి మార్కెట్ యార్డు కమిటీ సమిష్టి నిర్ణయాలు తీసుకొని ముందుకెళ్తుందన్నారు. అధునాతనమైన రైతు బజార్, మాంస విక్రయ శాలలు, రైతుల విశ్రాంతి గదులు, పశువులకు షెడ్లు నిర్మిస్తున్నామన్నారు. నార్సింగి పశువుల సంతకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని, వందల ఏళ్ల చరిత్ర ఉందని, దాన్ని మరింత పెంచేందుకు మావంతు శక్తివంచన లేకుండా పని చేస్తామని తెలిపారు. పాడి పశువుల విక్రాయలకు నార్సింగి మార్కెట్‌కు ఘనమైన చరిత్ర ఉందని, ఇక్కడికి తెలంగాణ, ఆంధ్ర, కర్నాటకలతో పాటు ఉత్తర భారత దేశానికి చెందిన రైతులు, వ్యాపారులు సైతం వచ్చి మేలు రకపు జాతులైన ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను కొనుక్కొని తీసుకెళ్తారని వివరించారు. అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం వలన ఇటీవల నార్సింగి మార్కెట్ యార్డులో క్రయ, విక్రయాలు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు మర్రి వేణుగోపాల్‌రెడ్డి, సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మధురగాన విధుషీమణి ఎస్పీ శైలజ : జస్టిస్ రామలింగేశ్వరరావు



ఎస్‌పి.శైలజకు 'ఘంటసాల శతజయంతి పురస్కారం' ప్రదానం చేస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త: నాంపల్లి నాంపల్లిస్టేషన్ కాడ రాజలింగో..రాజా లింగా..జానపద పాటలు అలవోకగా పాడగల ఎస్పీ.శైలజ శాస్త్రీయ గీతాలను స్వరబంధురంగా ఆలపించే మధురగాన విదుషీమణి అని ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అమరగాయకులు పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు శతజయంతి సందర్భంగా ప్రముఖ సినీ నేపధ్య గాయనీ ఎస్‌పి.శైలజకు 'ఘంటసాల శతజయంతి పురస్కారం' ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సినీనటులు శుభలేఖ సుధాకర్ హాజరై ఈ పురస్కారాన్ని అందించారు. సభను ప్రముఖ గాయనీ, భీమన్న సాహితీ నిధి అధినేత్రి హైమావతి భీమన్న ప్రారంభించగా. విశిష్ట అతిథులుగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్.అంజయ్య, జాతీయ మానవహక్కులు, యాంటీ క్రైం కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఆర్.రామమూర్తి నాయుడు, ప్రముఖ సినీ పరిశోధకులు సంజయ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు. 'పాటే మంత్రము' ఘంటసాల, ఎస్‌పి.శైలజ పాడిన పాటలతో 'సినీ గీత విభావరి' కార్యక్రమంలో గాయనీ గాయకులు ఎం.వి.రమణకుమారి, శశిరేఖ, హిమజ, శశికాంతి,ఎన్.బి.ఖాసిమ్, కె.సుధాకర్, వెంకట్‌బాబు, అంబాదాస్, వి.సతీష్, హరికృష్ణ తదితరులు గానం చేశారు.

## జిల్లా వ్యాప్తంగా అభివృద్ధికి నిధులు సక్రమంగా వినియోగించాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 14, ప్రభాతవార్త : మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అందే నిధులను సక్రమంగ వినియోగించాలని,పనులను వేగవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమీక్ష సమావేశంను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ జిల్లాలో 15మండాలాలు ఉండగ మండలానికి జిల్లా స్థాయి అధికారులను ఒక్కో మండలానికి ప్రత్యేక అధికారులుగ నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మండలానికి కేటాయించిన ప్రత్యేక అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు నిధులకు సంబంధించి ఎప్పటికపుడు పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎన్ని అభివృద్ధి పనులు మంజూరు ఉన్నవి, ఎన్ని పనులు ఏ స్థాయిలో ఉన్నాయనే వివరాలను తెలుసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అన్నారు. మండలాల్లో ప్రత్యేక అధికారులు పనుల ఖర్చులకు సంబంధించి వివరాలను ఎప్పటికపుడు సమీక్షించాలని, అవసరమైన పనులను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించటం వల్ల అభివృద్ధి పనులు వేగవంతం చేయటానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి నెలా ప్రత్యేక అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించి సమీక్షిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, అధికారులు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## ప్రపంచ సాహిత్యంలో అరుదైన ప్రక్రియ తెలుగు పద్యం



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రసాద్ తోటకూర, ప్రముఖ రంగ స్థల కళాకారుడు గుమ్మడి గోపాల కృష్ణ తదితరులు

చార్మినార్, డిసెంబరు 14 ప్రభాతవార్త : ప్రపంచ సాహిత్యంలో ఓ భాషలోను లేని అరుదైన ప్రక్రియ తెలుగు పద్యమని తెలుగు వారి సొత్తైన ఈ ప్రక్రియను కాపాడి ముందు తరాలకు అందించవలసిన బాధ్యత మనందిరిపై ఉందని ఉత్తర ఆమెరికా తెలుగు సంఘం (తానా) సాహిత్య విభాగం ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర అన్నారు.ఉత్తర ఆమెరికా తెలుగు సంఘం, తానా సాహిత్య విభాగం,తానా ప్రపంచ సాహిత్య వేదిక,ప్రభుత్వ సిటీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సిటీ కళాశాలలో జరిగిన మహోన్నతం – మన పద్యం అనే విద్యార్థి పద్య గాన సభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన పద్యాలలో ఉన్న మానవీయ విలువలు,వ్యక్తిత్వ వికాసం వంటివి నేటి తరాల విద్యార్థులకు అందించటం, అలాగే పద్య పఠనం ద్వారా, విద్యార్థులలో ఏకాగ్రత,జ్ఞాపక శక్తిని పెంపొందించటం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ కవుల,సాహితీ వేత్తల సాహిత్యాన్ని ప్రచురించి ప్రాచుర్యం కల్పిస్తున్నామని ఆయన తెలియజేశారు.

**పౌరాణిక నాటక పద్యాలలో గొప్ప జీవన విలువలున్నాయి : గుమ్మడి గోపాల కృష్ణ**

పౌరాణిక నాటక పద్యాలలో గొప్ప జీవన విలువలున్నాయని ప్రముఖ రంగ స్థల కళాకారుడు గుమ్మడి గోపాల కృష్ణ అన్నారు.పౌరాణిక నాటకల ప్రదర్శన ద్వారా తెలుగు పద్యానికి విస్తృతి పెరిగిందని, సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణ రాయభారం,శ్రీ కృష్ణ పాండవీయం తదితర పద్య నాటకాలు తెలుగు ప్రజాకానికి గొప్ప సాంస్కృతిక సంతృప్తిని కలిగించాయని ఆయన తెలిపారు.తెలుగు పౌరాణిక నాటకాలలో గొప్ప జీవన విలువలు ఉన్నాయని,మహోన్నతం–మన పద్యం అనే కార్యక్రమం చారిత్రాత్మకమైనదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గానం చేసిన పద్యాలు మంత్ర ముగ్దులు చేశాయి.,ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్.కోయి కోటీశ్వరరావు, సమన్వయ కర్త డాక్టర్ జె.నీరజ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట : రామకృష్ణారెడ్డి



మణికొండ మున్సిపల్ పరిధిలోని 19.వ.వార్డులో వీధి దీపాలను ప్రారంభిస్తున్న ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి

నార్సింగి, డిసెంబర్ 14 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మణికొండ మున్సిపల్ 19.వ, వార్డులో కౌన్సిలర్ వసంత్ చౌహాన్‌తో కలిసి రామకృష్ణారెడ్డి వీధి దీపాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులైన తాగునీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, పార్కులు, స్మశాన వాటికలు వంటి వాటి ఏర్పాటుకు మణికొండ మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సంబంధిత శాఖల అధికారులతో కలిసి చర్చించి పరిష్కరిస్తున్నామని వివరించారు. ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన ప్రతీ హామీని చేతలలో చేసి చూపిస్తున్నామని రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సూపర్ వైజర్ రాజు, మహేందర్, టిఆర్‌ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రతి ఒక్కరు సహకరించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్, డీఈఈ సన్నీ, ఏఈ శ్రావణి తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 14ప్రభాత వార్త: గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతినగర్ కొత్త బ్రిడ్జ్ నుంచి అశోక్‌నగర్, ఆర్‌సి.రెడ్డి సర్కిల్ వరకు నిర్మించబోయే వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ జిహెచ్‌ఎంసి డీఈఈ సన్నీ, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. రోడ్డునిర్మాణ పనులకు స్థానిక ప్రజలు సహకరించాలఎని, రవాణా వ్యవస్థకు కొన్ని రోజులు అంతరాయం కలిగే అవకాశం ఉన్నా ప్రజలు డివిజన్ అభివృద్ధికి సంపూర్ణ సహకారాలను అందించాలని కోరారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు లేకుండా పనలు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న మరికొన్ని వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నర్సింహ, సాయికిరణ్‌యాదవ్, సబర్మతినగర్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు తీర్చాలని బిజెపి నాయకుల ధర్నా

ఘట్‌కేసర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బిజెపి మండలశాఖ అధ్యక్షులు చలువాది ప్రవీణ్‌రావు విమర్శించారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలో బుధవారం గ్రామ అభివృద్ధి, సమస్యలపై బిజెపి నాయకులు ధర్నా నిర్వహించారు. గ్రామ బిజెపి అధ్యక్షులు ఎ ర్రోళ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో మండల బిజెపి అధ్యక్షులు చలువాధి ప్రవీణ్‌రావు, ప్రధానకార్యదర్శి రాచకట్ల శ్రీశైలంలు పాల్గొని మాట్లాడుతూ గ్రామకార్యదర్శి పనితీరును ఎండగట్టారు. ఇంటిపన్నుల వసూలు కోసం చావు డప్పుమోగించి ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారని, బిజెపి కార్యకర్తలపై కక్ష్యగట్టి ఆస్తులు జప్తు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా ఉన్న నీటి సమస్యను పరిష్కరించడంలో కార్యదర్శి బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఉన్న బోర్లకు మోటార్లు, స్టార్టర్లు తొలగించడంతో నీటి సరఫరాకు ఆటంకం కల్గుతుందని వెంటనే వాటిని బిగించి ప్రజలకు నీటి సరఫరాను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కక్ష్యపూరిత చర్యలును మానుకొని ప్రజాసమస్యలను తీర్చి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యదర్శి, పాలకవర్గం కృషి చేయాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో మండల ఎస్‌సీ మోర్చ అధ్యక్షులు సంకు మల్లేశ్, ఓబీసీ మోర్చ నాయకులు వెంకటేశ్, అలివాద సాయికిరణ్, తోటకూరి నరసింహ పాల్గొన్నారు.

## డిల్లీకి తరలివెళ్లిన ఉప్పల్ నేతలు



డిల్లీలో జరిగిన బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 14 ప్రభాతవార్త :** డిల్లీలో జరిగిన బిఆర్ఎస్‌పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఉప్పల్ నియోజకవర్గం నుంచి పలువురు పార్టీ నేతలు తరలివెళ్లారు. ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితోపాటు, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందం రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు, పార్టీనేతలు మహిపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి తదితరులు డిల్లీలో జరిగిన శ్యామలయాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని, పార్టీ కార్యాలయప్రారంభోత్సవానికి భారీ ఎత్తున తరలివచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## మెట్రో రైల్ పనులను ఓల్డ్ సిటీ వరకు విస్తరించాలి : భాగ్యలక్ష్మి



కార్పొరేటర్ భాగ్యలక్ష్మిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

**మలక్‌పేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** మెట్రో రైల్ పనులను ఓల్డ్ సిటీ వరకు విస్తరించాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్ర బిజెపి పిలుపుమేరకు ఈటెల రాజేందర్ అధ్యక్షతన మెట్రో రైల్ పనులను ఓల్డ్ సిటీ వరకు విస్తరించాలని, మెట్రో రైల్ రూట్‌ను మార్చినందుకుగాను లాల్‌దర్వాజ వద్ద నిరసన దీక్షల పాల్గనడానికి తరలివెళుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డిని మలక్‌పేట పోలీసులు ఆమె నివాసంలో గృహనిర్బంధం చేసారు. కార్యక్రమంలో ఎస్ఐ జయంత్, కానిస్టేబుళ్లు రామ్, గౌస్, నాయకులు యాదగిరి సురేందర్, సంతోష్, శరత్, దినేష్ తదితరులు ఉన్నారు.

## దోమలు వృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు : కార్పొరేటర్ శ్రావణ్



మున్సిపల్ సిబ్బందితో చర్చిస్తున్న కార్పొరేటర్ శ్రావణ్..

**నేరెడ్‌మెట్, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** డివిజన్‌లో దోమలు వృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని 140 డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శివపురి కాలనీలోని తన కార్యాలయంలో ఎంతోమాలజీ సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసారు. దోమల కారణంగా డివిజన్ పరిధిలోని కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నట్లు ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. దోమకాటు వల్ల పలు రోగాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలిపారు. ఈ విషయంపై ఎంతోమాలజీ సిబ్బందితో చర్చించి ప్రతి 5రోజులకు ఒక్కసారి ఫాగింగ్ చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ విషయంపై జోనల్ ఎంతొమాలజీ సూపర్‌వైజర్ దుర్గాప్రసాద్‌కు ఫోన్ చేసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీర్, మురళి, సాయి, నర్సింగ్, బీజెపి నాయకులు నందు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## దేశమంతటా కాంగ్రెస్ బలం పూర్తిగా పడిపోయింది:శ్రీవాణి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దయనీయంగా తయారైందని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ దిష్టిబొమ్మను లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి దగ్ధం చేయడం పట్ల బుధవారం కార్పొరేటర్ శ్రీవాణి తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఎంపీ రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రినిర్మలసీతారామన్ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఏమి చేయలేదని, కాంగ్రెస్ పార్టీ తమ ఉనికిని కాపాడుకునేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు.

## బీరప్పగడ్డలో భూగర్భ డ్రైనేజీ పనులు : కార్పొరేటర్ గీత



యుజిడి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 14 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డనుంచి శ్రీనగర్‌కాలనీ మీదుగా కల్వర్టు వరకు రూ. 58లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డ నుంచి శ్రీనగర్‌కాలనీ వరకు చేపడుతున్న పనులను అధికారులతో కలిసిపరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బీరప్పగడ్డలో డ్రైనేజీ పొంగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, మురుగునీరు రోడ్లపై పారకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్రమ్ ఇంటి సమీపంలో ఉన్న డ్రైనేజీ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమవుతుందన్నారు. డివిజన్‌లో ప్రణాళిక ప్రకారం పనులు చేపడుతున్నామని, పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, కె.జగన్, అబ్బుబాయ్, బాలు, శ్యామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్ తదితరులు పాల్గొన్నారు.

## చంపాపేటలో ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టి బొమ్మ దగ్ధం



కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి తదితరులు

**సైదాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త:** కాంగ్రెస్ వార్ రూమ్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు చంపాపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కార్యాలయంలోకి చొరబడి కంప్యూటర్లను, హార్డ్‌డిస్క్‌లను పోలీసులు దౌర్జన్యంగా తీసుకువెళ్లారని అన్నారు. కార్యాలయంలోని ముగ్గురు సిబ్బందిని పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లారని అయితే వారు ఎక్కడ ఉన్నారో కూడా పోలీసులు చెప్పకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. కెసిఆర్ కనుసన్నల్లోనే పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దౌర్జన్యానికి పాల్పడ్డారని, ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని తగిన సమయంలో వారే టిఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. అరెస్టులు, దాడులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని, ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృత ం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, సారయ్య, వెంకటేష్, కిరణ్, బాలరాజు, రఘు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్‌లో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, మేయర్ పారిజాత తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో బుధవారం 50వ రంగారెడ్డి జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శన ప్రారంభమైంది. స్థానిక శ్రీ వంశీధర్ హై స్కూల్‌లో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ తిలకించి విద్యార్థులను ప్రశంసించారు. సైన్స్ ఎగ్జిబిషన్ సందర్భంగా మేయర్ పారిజాత మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను పారద్రోలి విజ్ఞానాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్‌లో జరిగే చైతన్య కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ సుశీందర్‌రావు, మండల విద్యాధికారి కృష్ణయ్య, స్థానిక కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అయితే గురువారం ఈ విద్యావైజ్ఞానిక ప్రదర్శన ముగింపు ఉంటుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి హాజరుకానున్నారు.

## విద్యార్థులు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి : ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి




విద్యార్థిని అభినందిస్తున్న ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

**మలక్‌పేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** విద్యార్థులు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని ప్రగతి మహిళా డిగ్రీ కళాశాల ఛైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. దిల్‌సుక్ నగర్‌లోని తమ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు అంకితభావంతో లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగ పరుచుకుని సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతో అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ సీతారాంరెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ పి.రాంరెడ్డి, టి.చిన్నారెడ్డి, ప్రిన్సిపల్ మంజురెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని స్వాగతిస్తున్నాం: కార్పొరేటర్ అరుణ ప్రభాకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ప్రత్యేకంగా మహిళా షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు కార్పొరేషన్ 28వ డివిజన్ కార్పొరేటర్ జిల్లెల అరుణప్రభాకర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్‌లోని పెద్ద చెరువు కట్ట సమీపంలోని ఖాళీ స్థలంలో మహిళా మండలి షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని ప్రతిపాదించడం హర్షణీయమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సబితమ్మ పాలనలో మహిళల సంక్షేమం, మహిళలకు ప్రోత్సాహం జరుగుతుండడం శుభ పరిణామమని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌లో రాజకీయాలకతీతంగా అందరూ మంత్రి నిర్ణయాన్ని స్వాగతించి మహిళా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న రంగారెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా సరూర్‌నగర్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి నియామకమయ్యారు. ఈమేరకు రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డిలు బుధవారం మధుసూదన్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో బిజెపి బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కలుపుకొని కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఆర్కేపురం కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి సలహాలు సూచనలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నాకు అప్పగించిన బాధ్యతను నాయకులు, కార్యకర్తల సహకారంతో న్యాయం చేస్తామన్నారు.

## ప్రజా సంగ్రామ యాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్రలో రాజ్యలక్ష్మి..

**నేరెడ్‌మెట్, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** బండి సంజయ్ చేపట్టిన 5వ విడత ప్రజా సంగ్రామ యాత్రలో బుధవారం వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, డివిజన్ అధ్యక్షులు ఓంప్రకాష్,నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేస్తుందన్నారు. బీజెపి ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజెపి నాయకులు శివ, సూరి, తదితరులు పాల్గొన్నారు.

## శబరిగిరీషుడి దర్శనానికి తరలిన అయ్యప్ప మాల దీక్షా ధారులు

**సైదాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త:** అయ్యప్ప మాల దీక్షా ధారులు తమ దీక్షను పూర్తి చేసుకుని శబరిగిరీషుడి దర్శనానికి బయలు దేరుతున్నారు. మలక్‌పేట బిజెపి నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి గురుస్వామి బుధవారం ఇరుముడిని కట్టుకుని శబరి గిరీషుడి దర్శనానికి బయలు దేరారు. రవీందర్‌రెడ్డి గురుస్వామితో పాటు ఇరవై మంది అయ్యప్ప మాలధారులు అయ్యప్ప స్వామి దర్శనానికి తరలివెళ్లారు.

## రేపటి నుండి ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు

**సైదాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మినగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానము–ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ వారి సౌజన్యంతో ధనుర్మాస తిరుప్పావై ప్రవచనములు జరుగనున్నాయి. ప్రవాచకులు నల్లాన్ చక్రవర్తుల వెంకట నరసింహాచార్యులు ఈ నెల 16వ తేది నుండి జనవరి 14వ వరకు తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వై.ఎస్.ఆర్.మూర్తి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పాశురాల అంతరార్థాలను తెలుసుకుని భగవంతుడిని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్‌కు తరలిన కార్మికులు, నాయకులు



ఆందోళన చేసి కలెక్టరేట్‌కు తరలిన కార్మికులు, నాయకులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి దళిత బంధు అమలు చేసి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి పలువురు కార్మికులు, వర్కర్స్ యూనియన్ నాయకులు తరలివెళ్లారు. యూనియన్‌నాయకుడు దాసరి బాబు ఆధ్వర్యంలో మీర్‌పేట్ కార్పొరేషన్ ముందు కొద్ది సేపు ప్రదర్శన నిర్వహించి ఆ తర్వాత కలెక్టరేట్‌కు తరలివెళ్ళారు.

## నిరుపేదలకు అండగా ఉంటాం : చిలుక



మంగిబాయ్‌కి నగదు అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** నిరుపేదలకు తమ అండగా నిలుస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌కెపురం డివిజన్ ఎన్‌టిఆర్‌నగర్‌కు చెందిన టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బిక్షపతినాయక్‌కుటుంబాన్ని పరామర్శించి,ఆయన భార్య మంగిబాయికి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిక్షపతి నాయక్ కుటుంబానికి తాము ఎల్లవేళలా అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో తలాటి రమేష్‌నేత, రాజునాయక్, శేఖర్‌ముదిరాజ్, భాస్కర్‌నాయక్, ప్రేమ్‌నాయక్, కళ్యాణ్, అష్రఫ్, రవినాయక్, లక్ష్మి, జ్యోతి, నీల, జహంగీర్, శ్రావణ్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియాపై పోలీసుల దాడికి నిరసనగా డిజిపి దిష్టిబొమ్మ దహనం



డిజిపి మహేందర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన రాఘవేందర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** నగరంలోని కాంగ్రెస్ సోషల్ మీడియా వింగ్ ఆఫీస్ (వార్ రూం) పై సోదాల పేరుతో పోలీసులు దాడి చేసి కంప్యూటర్లు, డాటాను సీజ్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని టీచర్స్ కాలనీచౌరస్తాలో డిజిపి మహేందర్‌రెడ్డిదిష్టిబొమ్మను దహనం చేశారు. దాడిని ఖండిస్తూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ధర్నా సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీకి పోలీసులు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించకుండా అధికారపార్టీకి తొత్తులుగా మారి ప్రతిపక్షాలను అణచివేయడానికి చూస్తున్నారని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో నాయకులు ఎద్దుల ప్రతాప్‌రెడ్డి, వినోద్ నాయక్, కౌశిక్, ప్రమోద్, జెమని, సాయి, ప్రణీత, సామ భాస్కర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, పలువురు ఎన్ఎస్‌యుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిరాంకాలనీ సమస్యలు పరిష్కారం : ఎం.రజితరెడ్డి



ఉప్పల్ సాయిరాంకాలనీ రోడ్ల సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 14 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ సాయిరాంకాలనీలో రోడ్లపై నీరునిల్వ ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్ పరిధిలోని సాయిరాంకాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో గత కొద్ది రోజులుగా రోడ్లపై నిత్యం నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, దీని పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, కొత్త సిసి రోడ్లు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, దేవిరెడ్డి, వర్కల మధన్ గౌడ్, రాజేందర్, బుచ్చిరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, అయోధ్య, సల్ల ప్రభాకర్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆందోళన



రామంతాపూర్‌లో సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు రఫీక్, నవీన్ తదితరులు

**రామంతాపూర్, డిసెంబరు 14 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ వార్‌రూమ్‌ను పోలీసులు సీజ్ చేయడాన్ని నిరసిస్తూ రామంతాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు ఎం.డి.రఫీక్, కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో రామంతాపూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలపై తెలంగాణ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, ప్రజాస్వామ్య పద్దతిలో నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, దీనిని అడ్డుకోవడం సబబు కాదన్నారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులు చేసి బెదిరించడం సబబు కాదన్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో టిఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతుల బొక్క సురేష్, షేక్ అలీమ్, యూత్ కాంగ్రెస్ నాయకులు కోటేష్, గంగా, షేక్ షబ్బీర్, సంపత్, చోటు, కళ్యాణ్, అరుణ్, అఖిల్, నగేష్, శివ, సయ్యద్ సిరాజ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటినుండి శ్రీ అండాళ్ నిలయంలో ధనుర్మాస ఉత్సవాలు

**మలక్‌పేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌లోని శ్రీ అండాళ్ నిలయంలో ఈ నెల 16వ తేదీనుండి జనవరి 14వ తేదీవరకు ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎ.లక్ష్మిదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఉభయ వేదాంతి శ్రీమాన్ అప్పన్ కందాడై లక్ష్మణమూర్తి స్వామివారిచే తిరుప్పావై ప్రవచనోత్సవములు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 2వ తేదీన ఉందుమదగళిత్త వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం సౌభ్యవంతులకు పసుపు, కుంకుమ, గాజులు, తాంబూల వితరణ కార్యక్రమం, 5వ తేదీన మాతశ్రీ రిందాదేవి తిరు నక్షత్రం సందర్భంగా 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, 8వ తేదీన దీపోత్సవం, భక్తులచే స్వామివార్లకు కర్పూర నీరాజనాలు, మంగళశాసనం, 11వ తేదీన అండాళ్ తల్లికి నీరాటోత్సవం, అనంతరం 108 గంగాళములతో అక్కార వడిశల్ విశేష ప్రసాద నివేదన వితరణ, 14వతేదీన బోగి పండుగ, గోదా కళ్యాణం, సాయంత్రం తిరుప్పావై ఫలశృతి తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం : ఛైర్‌పర్సన్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఛైర్ పర్సన్ స్వప్న

**హయత్‌నగర్, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ చెవుల స్వప్న అన్నారు. మున్సిపాలిటీ పరిధి 3వ వార్డులో 5లక్షల రూపాయలతో ఏర్పటు చేయనున్న సిసి రోడ్డు పనులకు ఆమె స్థానిక కౌన్సిలర్ మోతె మనెమ్మ రామలింగంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికోసం అదనంగా ప్రత్యేక నిధులను కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సంపూర్ణ రెడ్డి, కమిషనర్ రామాంజుల రెడ్డి, కౌన్సిలర్లు రాజేందర్, అనురాధ సురేష్, డీఈఈ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు లాటరీ ద్వారా ప్లాట్ల పంపిణీ : ఆర్డీఓ



లబ్ధిదారులకు ప్లాట్ల పంపిణీ చేస్తున్న ఆర్డీఓ వెంకటాచారి

**తుర్కయంజాల్, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మునగనూరు, మన్నెగూడ రెవెన్యూ పరిధిలో గతంలో ప్రభుత్వ భూమి సాగు చేసుకొని జీవనోపాధి పొందిన పలువురు లబ్ధిదారులకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో వెంకటాచారి ఆధ్వర్యంలో ప్లాట్లను పంపిణీ చేశారు. మునగనూరులోని సర్వే నెంబర్ 120లో 20మంది లబ్ధిదారులకు 500 గజాల చొప్పున స్థలం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, మన్నెగూడలోని సర్వే నెంబర్ 27/1, 27/2లో 19 లబ్ధిదారులకు 400 గజాల స్థలం చొప్పున ప్లాట్లను లాటరీ ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కౌన్సిలర్లు వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, సంగీతమోహన్‌గుప్తా, సీనియర్ నాయకులు కందాడ లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, తాసిల్దార్ అనితారెడ్డి, ఆర్ఐ భిక్షపతి, వీఆర్ఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం : చెకోలేకార్



చెకోలేకార్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు



కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దర్పల్లి తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని టిపిసి ప్రధాన కార్యదర్శి చెకొలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యూహకర్త కార్యాలయంలో పోలీసులు సోదాలు చేయడం, అరెస్టులను నిరసిస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేయాలని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు చెకొలేకార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నిస్తుండగా సలీంనగర్‌లోని ఆయన నివాసంలో మలక్‌పేట పోలీసులు ఆయనను హౌస్ అరెస్టు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లు సాధించి తెలంగాణాలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మహేష్, భాస్కర్, నాగరాజుగౌడ్, శివ, స్వామి, సాయిరాం, సత్యనారాయణ, రాజేశ్వరరావు, రాజేందర్, దేవేందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి ప్రధాన కార్యదర్శి ఎం.రజితరెడ్డికి ఘన సత్కారం



పిసిసి ప్రధాన కార్యదర్శి రజితరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నేతలు

**ఉప్పల్, డిసెంబరు 14 ప్రభాతవార్త :** తెలంగాణ పిసిసి కార్యదర్శిగా నియమితులైన ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డిని బుధవారం పలువురు కాంగ్రెస్ పార్టీనేతలు ఘనంగా సత్కరించారు. ఉప్పల్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోరంపేట కృష్ణ, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, సందీప్‌రెడ్డి, అధ్యక్షుడు బాకారంలక్ష్మణ్, ప్రకాష్‌రెడ్డి, ఉమ, లింగంపల్లి రామకృష్ణ, తోకట రాజు, సుక్క జీవన్, మహేష్, వెంకటేష్, చీమల భాస్కర్, పి.లక్ష్మణ్, జిత్తురెడ్డి, కన్నమైన నరేష్ తదితరులు కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తనపై నమ్మకంతో పిసిసి కార్యదర్శిగా నియమించారని, పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.